## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 28-11-01, పొతాళమెరక)

కె.వి.కె. రాజుగారి జయంతి సందర్భంగా జరిగిన సభలో సద్గురు శ్రీనాన్నగారి కోరికమేరకు మొదట శ్రీ రామకృష్ణగారు ప్రవచనము చేసారు. శ్రీ రామకృష్ణగారు ఇంతకుముందు పశ్చిమగోదావరి కలెక్టర్‌గా పనిచేసారు. శ్రీ రామకృష్ణగారు భక్తులు, ముముక్షువులు.

### శ్రీ రామకృష్ణగారి ప్రవచనము

భగవాన్ శ్రీ నాన్నగారికి శిరస్సువంచి సహస్ర ప్రణామములు అర్పిస్తున్నాను. ఆత్మస్వరూపులైన సోదర సోదరీమణులకు నా హృదయపూర్వక నమస్కారములు అందజేస్తున్నాను. సద్గురు శ్రీ నాన్నగారు జ్ఞానసముద్రులు. అజ్ఞానంవలన వచ్చే అలలయొక్క కదిలిక లేకుండా ఉన్న శాంతస్వరూపం ఆయనది. సాధన ఎంత ఉన్నప్పటికికూడా ఆత్మావలోకనం జరగాలంటే గురువు అనుగ్రహం కావాలి. ఈ అనుగ్రహం అనేక రకాలుగా కలగటానికి అవకాశం ఉంది. గురువు అనేక రకాల దీక్షలు ఇస్తూఉంటారు. మచ్చదీక్ష, కమటదీక్ష, కుక్కుటదీక్ష ఇలా రకరకాలుగా ఉంటాయి. చేప గుడ్లుపెట్టి వాటిని చూస్తూ అలా నీటిలో ఈదుతూఉంటుంది. దృష్టిమాత్రంచేతనే అవి పిల్లలు అయిపోతాయి. సద్గురువుయొక్క దృష్టి మనమీద పడితే చాలు దాని ఫలితం మనమీద ఉంటుంది. కమటదీక్ష అంటే తాబేలు ఒడ్డుకువచ్చి గుడ్లుపెట్టి మరల సముద్రంలోనికి వెళ్ళిపోతుంది. ఆ గుడ్లు ఎలా పిల్లలు అవుతాయి? తల్లి తాబేలు మనస్సులో అనుకొంటుంది అట ఆ గుడ్లు ఏ ఆపదలేకుండా చక్కగా పిల్లలు క్రింద మారాలి అని అనుకొంటుందట. అందుచేత సద్గురువు దగ్గర మనం మసలుకొనే విధానాన్నిబట్టి ఆయన మనస్సులో మనం స్థానం సంపాదించుకొంటే ఆయన ప్రత్యక్షంగా లేకపోయినప్పటికి మనకు జ్ఞానం కలగటానికి అవకాశంఉంది. కుక్కుటదీక్ష అంటే కోడిగుడ్లుపెట్టి వాటిమీద పొదిగి వాటికి వెచ్చదనం చేకూర్చితే అవి పిల్లలు అవుతాయి. ఆ రకంగా గురువులు దగ్గరగా పెట్టుకొని వారికి ప్రతీనిత్యం ఉపదేశంచేస్తూ, ఫిజికల్‌గాకూడా సంబంధం పెట్టుకొంటూ వారిని కృతార్థులు చేసే అవకాశం ఉంది. ఇవి దృష్టిలో పెట్టుకొని శ్రీ నాన్నగారి ప్రవచనంఉందిఅంటే అంతదూరంనుండి రావటానికి కారణం ఏమిటిఅంటే వారి అనుగ్రహదృష్టి కలిగితే ఏనాటికయినా మన సాధన ఫలిస్తుంది అనేటువంటి ఒక దృఢమైన విశ్వాసం వలన ఇక్కడకు వచ్చి ఈ సభలో పాల్గొనాలి అని అనుకొన్నాను. అయితే వారికిఉన్న





కారణంలేని ప్రేమవలన, కరుణవలన నాకు ఇక్కడ మాట్లాడటానికి అవకాశం ఇచ్చారు. ఏదైనా విషయంగురించి తెలిసినవారు చెప్పవచ్చు. కాని తెలియనివారుకూడా చెప్పవచ్చు గురువు అనుగ్రహంవలన అని ఇప్పుడు ఇక్కడ ఋజువవుతోంది. దీనినిబట్టి గురువు అనుగ్రహం ఎలా ఉంటుందో మీకు తెలిసే అవకాశంఉంది. పొలం దున్నుదామని నాగలిని సాపుచేస్తూఉంటే దానిక్రింద అనుకోకుండా ధనందొరికిందట. చాలా దాహంగాఉంది ఏదో నీరు దొరికితే చాలు అనుకొంటూఉంటే దేవలోకంలోఉన్న గంగానదిలోఉన్న నీరు దాహం తీర్చుకోవటానికి పట్టుకొనివచ్చిఇచ్చారట. ఆవిధంగానే మన మనస్సు అనేక రకాలుగా విచ్ఛేదం పొందుతున్న పరిస్థితులలో ఈ రమణమార్గమును మనకు అందించటానికి నిరంతరం కృషిచేస్తూ, ఆ మార్గంలో నడవటానికి మనకు అవకాశం కల్పిస్తున్నారు సద్గురు శ్రీనాన్నగారు. జ్ఞానం సామాన్యమైన విషయంకాదు. భక్తి తొందరగా అర్థమవుతుంది. భక్తిలో పరిణితిచెందితే మార్గం కనిపించటానికి అవకాశంఉంది. అలా తిన్నడికి కనిపించిందట. చెప్పలతో శివలింగాన్ని శుభ్రం చేసాడు, నోటిలో నీరుపోసుకొని పుక్కిలించి ఊసి అభిషేకం చేసాడు, కొంచెం తిని వదిలేసిన మాంసపుముక్కను నైవేద్యంగా పెట్టాడు. అయినాకూడా స్వామి అతనిని అనుగ్రహించాడు ఎందుచేతనంటే అతనిలోఉన్న ఏకాగ్రతవలన. జ్ఞానం అనేటప్పటికి భక్తిలో పరవశించి చివరకు అగ్రం చేరితేతప్ప జ్ఞానంలోనికి రావటంకష్టం. అటువంటి జ్ఞానమార్గాన్ని శ్రీ నాన్నగారు ఉద్బోధిస్తున్నారు. అయితే జ్ఞానమార్గం గురించి చెపుతున్నారు మేమువింటున్నాము. దీనివలన ఏమైనా ఉపయోగం ఉంటుందా? ఇదే నారదుడు ఒకసారి విష్ణుమూర్తిని అడిగాడట. సత్సంగంవలన ఉపయోగం ఏమిటి? మహాత్ములను చూడటంవలన పాపరాశి అంతాపోతుంది అంటున్నారు ఏమిటి అనిఅడిగాడు. అప్పడు విష్ణుమూర్తి నీవు ఒక పనిచెయ్యి. కర్ణాటకదేశంలో పురుగుకు ఒక పిల్ల పుట్టింది దానిని చూసిరా అనిచెప్పాడు. నారదుడు వెళ్ళాడు ఆ పిల్లనుచూసాడు. వెంటనే ఆ పిల్లచనిపోయింది. నారదుడు తిరిగివచ్చి విష్ణుమూర్తితో ఇంతపనిచేసారు ఏమిటి నేను చూసినవెంటనే ఆ పిల్ల చనిపోయింది అన్నాడు. అయితే ఒకపనిచెయ్యి పాండ్యదేశంలో ఒక ఆవుకు దూడపుట్టింది దానిని చూసిరా అన్నాడు. నారదుడు వెళ్ళాడు ఆ దూడను చూసాడు. ఆ దూడ వెంటనే చనిపోయింది. తిరిగివచ్చి ఏమిటి ఇలాచేస్తున్నారు నా మూలంగా ఇవిఅన్నీ చనిపోతున్నాయి అన్నాడు. అయితే ఈసారి ఇంకోరాజ్యంలో రాజుగారికి అబ్బాయి పుడతాడు ఇప్పడే నువ్వువెళ్ళిచూడు అన్నాడు. నారదుడు సందేహించాడు. ఇప్పటికే ఇద్దరిని చంపాను ఇంకవద్దు అంటాడు. అలాకాదు ఈసారి వెళ్ళు నీకు సరియైన సమాధానం దొరుకుతుంది అని విష్ణుమూర్తి చెప్పారు. నారదుడు వెళ్ళాడు. ఆ పిల్లవాడు నారదుని చూసిన వెంటనే మాట్లాడటం మొదలుపెట్టాడు. అప్పడు నారదుడు

పిల్లవాడితో సత్పురుషులను చూడటంవలన చాలా ఉపయోగం ఉంటుంది అని మా తాతగారు చెప్పారు దానిగురించి నిన్ను అడగమన్నారు అని చెప్పాడు. అప్పుడు ఆ పిల్లవాడు చెప్పాడు అయ్యా! మీరు మొదటిసారి చూసినప్పుడు నేను పురుగుక్రింద పుట్టాను ఎప్పుడైతే మిమ్మల్ని చూసానో ఆ జన్మ విమోచనం అయ్యింది. లేకపోతే చాలాకాలం ఆ పురుగుకింద బతికి నానా అవస్థలు పడవలసివచ్చేది. తరువాత ఉత్తమమైన జన్మ ఆవుదూడకింద పుట్టాను. తరువాత మళ్ళీ మీరు కనిపించారు. మహానుభావులు మీరు కనిపించారు కాబట్టి వెంటనే ఆ జన్మపోయింది. ఇప్పుడు రాజుగారి ఇంటిలోపుట్టాను మహారాజును అవుతాను ఇదిఅంతా మిమ్మల్ని చూడటంవలననే కలిగిందికదా అందుచేత సత్సాంగత్యంవలననే ఇది కలుగుతుంది అని చెప్పాడు. అందుచేతనే విష్ణుమూర్తి ఇలాచెప్పాడు అని నారదుడు అనుకొన్నాడు. నాన్నగారి ప్రవచనములో కొన్ని విషయాలు మనకు అర్థం అవ్వవచ్చు, కొన్ని విషయాలు అర్థంకాకపోవచ్చు అంతస్థాయి అందరికి ఉండకపోవచ్చు. వారి చూపుమన మీదపడితే, వారి మాట మనంవింటే దానివలన మనకు ఆత్మావలోకనం కలిగే అవకాశములు చాలా ఎక్కువగా ఉంటాయి. ఆ ఉద్దేశంతో నేను ఇక్కడకు రావటం జరిగింది. అయితే చెప్పింది వినటంకంటే దానిని ఆచరించటంలోనే కష్టం మనకు కనబడుతూ ఉంటుంది. ఒక ధనవంతుడు చాలా ప్రవచనములు విన్నాడు. ఆయనకు మరణసమయంలో ఏదో చెప్పాలి అని చూస్తున్నాడు కాని మాటరావటంలేదు కొడుకులు ఏమనుకొన్నారు అంటే ఈయన ఎక్కడో ఏదో దాచిపెట్టి ఉంటాడు అది చెప్పటానికి ప్రయత్నంచేస్తున్నాడు అనుకొన్నారు. మాటవస్తే అదిచెపుతాడు అని వైద్యులను పిలిపించి చాలా డబ్బు ఖర్చుపెట్టి మందులువేసారు, అప్పుడు మాటవచ్చింది. ఆయన ఏమిచెప్పాడుఅంటే ఎదురుగా చూపించి అక్కడ చీపిరిని కుక్క పాడుచేస్తోంది జాగ్రత్తగా చూసుకోండి అనిచెప్పాడు. అంటే విషయములు వినటం వేరు, వాటిని అమలుజరపటంవేరు. దైనందిన జీవితంలో మనలో కామక్రోధములు ఎంతవరకు ఉన్నాయి, వాటిని తగ్గించుకోవటానికి మనం ఎంతవరకు ప్రయత్నం చేస్తున్నాముఅని జాగ్రత్తగా చూసుకొంటే తప్ప మనం అభివృద్ధిని సాధించటం కష్టం. ఈ రకమైన Self assessment చేసుకోవటానికి గురువాక్యం ఉపయోగపడుతుంది. గురువాక్యం వినటంవలన మన మనస్సు ఎప్పటికప్పుడు refresh అవుతూఉంటుంది. గురువు అనుగ్రహం మనమీద కలగాలంటే మన నడవడికలో ఏమార్పులు చేసుకోవాలో ఎప్పటికప్పుడు చూసుకొంటూ ఆ రకమైన మార్పులు తెచ్చుకొంటూ గురువుయొక్క వాక్యం విన్నట్లయితే వెంటనే మనలో అభివృద్ధి రావటానికి అవకాశం ఉంది. మనం ఏదైనా చేయటానికి ఈ మానవజన్మలోనే అవకాశంఉంది. అందువలన ఈ మానవజన్మను సద్వినియోగం చేసుకోవాలి. గురువు మన హృదయంలోనే ఉన్నాడు అనే భావన నిత్యం ఉండాలి. ఈ మానవజన్మ వచ్చినందుకు జీవన్ముక్తి కలగటం అనేది పరమావధి అని పెద్దలు చెపుతారు. శరీరం ఉండగానే ముక్తికలిగితే ఆ ఆనందం వర్ణించటానికి వీలులేనిదిఅని చెపుతారు కాని మనలోఉన్న గుణాలవలన మనం ఏదిచేసినా మనమే ఈ పనిచేస్తున్నాము, ఈ శరీరమే ఈ పనిచేస్తోంది అనేభావన కలిగిఉంటాము. అది పోగొట్టుకోవటం కష్టం ఎందుచేతనంటే అది అనేక జన్మలనుండి బలపడిపోయిఉంది, అది ఒకేసారి పోవటం కష్టం. ఒక కుర్రవాడు స్కూలునుండి ఇంటికి వెళుతూ రాళ్ళగుట్టలోని ఒకరాయినితీసి పైకివిసిరాడు. ఆ రాయి మిగిలినరాళ్ళతో అంది నాకు ఎప్పటినుండో విమానంలా ఎగరాలనిఉంది. నేను విమానంలా ఎలా ఎగురుతున్నానో చూసారాఅంది. ఆ రాయి ప్రక్కనే ఉన్న మేడలోని అద్దాల కిటికీకి తగిలింది, అద్దం బద్దలయ్యింది. అప్పుడు ఆ రాయి అంది చూసారా నాకు ఎదురువస్తే ఎలా నాశనం చేస్తానో చూసారా అనిచెప్పింది. కిటికీ బద్దలయిన తరువాత ఆరాయి లోపలఉన్న తివాచీమీద పడింది. అప్పుడు ఆరాయిఅంటోంది నేను వెళ్ళేటప్పటికి తివాచీ పరచి ఎలా స్వాగతం చెపుతున్నారో చూడండిఅంది. ఆ శబ్దం ఒక నౌకరువిని వచ్చి రాయి తివాచీమీద పడింది, ఎవరో పిల్లవాడు విసిరిఉంటాడు అనుకొని ఆ రాయినితీసి బయటకు విసిరేసాడు. అది తిరిగివచ్చి ఆ రాళ్ళగుట్టలోనే పడింది. అప్పుడు ఆరాయి ఏమిఅంటోందిఅంటే మిమ్మల్ని విడిచిపెట్టి ఉండలేక బెంగపెట్టుకొన్నాను అందువలన తిరిగివచ్చేసాను అనిచెపుతోంది. మన మనోప్రవృత్తి ఆరాయిలా ఉంటుంది. జరిగేవిఅన్నీ జరుగుతూఉంటాయి. కాని మనం చేసాము అని చెపుతూఉంటాము. ఆ రాయిలాంటి మనోప్రవృత్తిని పోగొట్టుకొంటే జడప్రవృత్తిపోయి చైతన్యంలోనికి రావటానికి అవకాశంఉంది. గురువాక్యాలను అందుకు ఉపయోగించాలి అని చెపుతూ గురువుయొక్క పరిపూర్ణమైన కటాక్ష వీక్షణాలు మనందరిపై ఉండాలి అని కోరుకొంటూ నాన్నగార్కి హృదయపూర్వక నమస్కారములు అందజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.



సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనము

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కర్మను యోగంగా చేసినవ్యక్తి కాటన్ మహర్షి. అందువలననే ఆయనను కాటన్‌దొర అనటంకంటే కాటన్‌మహర్షి అనటం నాకు ఇష్టం. స్వార్థంలేకుండా పనిచేస్తూఉంటే ఇంద్రియాలు శుద్ధిఅవుతాయి. భక్తియోగంవలన మనస్సు పవిత్రం అవుతుంది. పరమపవిత్రుడికి లోపలఉన్నవస్తువు తనంతట తానుగా వ్యక్తమవుతుంది. కోరికనుబట్టి ఏదీరాదు మనకు

అర్హతఉంటే వస్తుంది. భగవంతునికి పక్షపాతం ఏమీలేదు. మనకు ఎంతవరకు యోగ్యత ఉందో అంతవరకు ఆయన అనుగ్రహం మనకు అందుతుంది. ఆయన అనుగ్రహం సంపాదించాలంటే కేవలం మన భక్తిని పూజగదికే పరిమితం చేయకూడదు. దైనందినజీవితంలో వ్యక్తిభావనలేకుండా ప్రవర్తించాలి. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది. భగవంతుడే కర్తఅని పరిపూర్ణమైన విశ్వాసం మనకుఉంటే ఈక్షణంలో దుఃఖంనశిస్తుంది. కర్తృత్వమే దుఃఖానికి కారణం. కర్తృత్వం నశిస్తే అప్పటికప్పుడు హృదయంలోఉన్న ఆనందంవచ్చి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది. కర్తృత్వం పూర్తిగా నశించాలంటే వ్యక్తిభావనలేకుండా పనిచేయాలి. గుర్తింపులు కోరుకోకూడదు. గుర్తింపులు కోరుకొంటే వ్యక్తిభావన పెరుగుతుంది. ఈ సాధన కష్టంఅని చాలామంది అనుకొంటారు. కష్టంఅనుకొనేదికూడా ఒక తలంపే. కష్టం, కష్టం అనుకోవటంవలననే మనకు ఇబ్బందిఅంతా వస్తోంది. దైనందినజీవితంలో మాటల విషయంలో జాగ్రత్తగాఉండాలి. అవసరమైనప్పుడు మాట్లాడాలి, అవసరంలేనప్పుడు మాట్లాడకూడదు. ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే మాట్లాడాలి. మాట sweet గా soft గా ఉండాలి. సత్వగుణం ప్రాక్టీసుచేసుకొంటూరావాలి. మాటలో, చేతలో రజోగుణం ఉండకూడదు. ఈ లోకంలోనికి నీవువచ్చి వెళ్ళిపోయిన జాడకూడా తెలియకూడదు అనేవారు భగవాన్. అంటే అంత నిర్మలంగా, అంతకూల్‌గా పనిచెయ్యి. మనం ఏ యోగంలో ప్రయాణంచేసినా మన సాధన అంతా ఎక్కడ కేంద్రీకరించాలిఅంటే దేహాభిమానాన్ని తగ్గించుకొంటూరావాలి. దేహంతో ఏనేనుఅయితే తాదాప్యం పొందుతోందో దానిలోనుండి విడుదలపొందాలి. భగవంతునిదగ్గరనుండి ఏదీ మనం బలవంతంగా పొందలేము, ఆయన అనుగ్రహంవలన మనం పొందుతాము. భగవంతుని అనుగ్రహం పొందటానికి అనుగుణంగా మన జీవితవిధానాన్ని తీర్చిదిద్దుకొంటే ఆయన అన్నీఇస్తాడు, మోక్షంకూడాఇస్తాడు.

శరీరము, మనస్సు మనకు స్వాధీనంలోఉండాలి, ఆత్మజ్ఞానసముపార్జనకు అవి మనకు ఉపయోగపడాలి. మానవుడికి కావలసింది సుఖం, శాంతి, ఆనందం. డబ్బులో సుఖంఉందిఅని డుబ్బుసంపాదిస్తాడు, పెళ్ళిలో సుఖంఉందిఅని పెళ్ళిచేసుకొంటాడు. మానవుడు ఏపనిచేసినా ఆనందంకోసమే చేస్తాడు. డబ్బులో ఆనందంఉందిఅని ముందు డబ్బు సంపాదిస్తాడు తరువాత తెలుస్తుంది అందులో ఆనందంలేదని. ఆనందం ఎక్కడోఉంది అని అనుకొంటూ ఉంటాడు. లోపలఉన్నవాసన విషయాలలో ఆనందంఉందిఅని మనకు అనిపింపచేస్తుంది. అదేమాయ. ఒకోమనిషికి ఒకోరకమైన వాసన ఉంటుంది. ఆ వాసనే విషయాలను చింతింపజేస్తుంది. వాసనాక్షయం అయితేగాని నీవు విషయచింతననుండి బయటకురాలేవు. అకారణభక్తి ఉన్నవాడికి ఈశ్వరుడు సృష్టించిన విషయాలకంటేఈశ్వరుడే





వాడికి కావాలి. వాడికి ఈశ్వరుడిమీద భక్తిఉంటుంది, ప్రేమ ఉంటుంది. ఎందుకు ఇంతప్రేమ ఉందిఅంటే కారణం కనబడదు అది అకారణభక్తి. అకారణభక్తివలన అన్నీవస్తాయి, మోక్షంకూడావస్తుంది. వారు మనలను ప్రేమిస్తున్నారు, వీరు మనలను ప్రేమిస్తున్నారుఅని మనం అనుకొంటాము. అహంకారంతో ప్రేమించే ప్రేమనిజంకాదు. అసలు ప్రేమ ఉన్నచోట కోరిక ఉండనే ఉండదు. ఈశ్వరుడికంటే మనలను ప్రేమించేవారు ఈ సృష్టిలో ఎవరూలేరు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడుఅని పరిపూర్ణమైన విశ్వాసంఉంటే మనం అహంభావనలోనుండి విడుదలపొందుతాము. మనం ఒకపనిచేస్తే పొగిడేవారు ఉంటారు, విమర్శించేవారు ఉంటారు. మంచిపనిచేసి దానిని మెచ్చుకోవాలి అని అనుకొంటే దానివలన అహంభావన పెరుగుతుంది. సాధన రహస్యంఒకటే అహంభావనకు food supply అవ్వకుండా చూసుకో, ఈ జన్మలోనే నీవు జీవన్ముక్తుడవు అవుతావు. అహంభావన ఎప్పుడైతే నశించిందో నీలోపల ఉన్న నిజం నీకు వ్యక్తమవుతుంది. దాని స్వరూపమే ఆనందం, దానిస్వరూపమే శాంతి, దానిస్వరూపమే ఉండటం. దేహం మరణించినప్పుడు మనం మరణిస్తాముఅని మనం అనుకొంటాము దేహం మరణించినప్పటికి నాకు మరణంలేదు, దేహానికి నాకు కొంచెంకూడా సంబంధంలేదు, దేహానికి సంబంధంలేకుండా నేను ఉన్నాను అనే అనుభవం భగవాన్‌కు కలిగింది. దేహం మరణించినప్పటికి మరణంలేనివస్తువు ఒకటిలోపలఉంది. ఆ వస్తువుఆయనకు అనుభవంలోనికివచ్చింది. ఇదిఅంతా కొన్ని క్షణాలలో జరిగింది అది ఈశ్వరానుగ్రహం. ఆయనలో అసలువ్యక్తిభావన కనబడదు. మీఅనుగ్రహంవలన మాకు జ్ఞానంకలగాలిఅని ఎవరైనా అడిగితే ఎవరి అనుగ్రహంవలన నాకు జ్ఞానంకలిగిందో వారి అనుగ్రహంవలననే మీకు జ్ఞానంకలుగుతుందిఅని చెప్పేవారు. మనం ఎక్కువగా దేహగతమైన నేనును ప్రతీవిషయంలోను వాడతాము. కాని ఆయన మాటలలో ఎక్కడా అది కనబడదు. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా మిధ్యానేనులోనుండి విడుదలపొందాలి మనం ఏపనిచేసినా ఇష్టంతోగాని, అయిష్టంతోగాని చేస్తాము. మనం ధర్మానుగుణంగా పనిచేయటంలేదు. అందువలననే మనకు జ్ఞానం కలగటంలేదు. మనలో ధర్మంకోసం పనిచేసేవారు ఎంతమందిఉన్నారు? అమ్మమంచిదా, చెడ్డదా అనేది అనవసరం. తల్లిని చూడమని భగవంతుడు చెప్పాడుకదా అని తల్లిని చూసేవారు మనలో ఎంతమంది ఉన్నారు? తల్లి నిజంగా మంచిదికాకపోయినా భగవంతుడు తల్లిని చూడమని చెప్పాడు కాబట్టి తల్లిని చూడాలి. మన ఇష్టాన్ని, అయిష్టాన్ని ఒకప్రక్కనపెట్టి ధర్మాన్ని ఆచరిస్తూఉంటే మిధ్యానేను దానిఅంతట అదే రాలిపోతుంది మనం బలవంతంగా దానిని పోగొట్టుకోవాలంటే అది పోదు. రాగద్వేషములనుండి ఇష్టము, అయిష్టము వస్తాయి. ఇదిఒకఅడవి. ఇందులోనుండి

బయటకు రాకపోతే చిత్తశుద్ధి కలుగదు. చిత్తశుద్ధిలేనివారికి చిత్తశాంతిలేదు. శాంతిలేనివాడికి సుఖంలేదు. మనం ఏనాటికయినా మనహృదయంలోఉన్న నిజం దగ్గరకువెళ్ళాలి లేకపోతే మనకు స్వేచ్ఛలేదు. నిజందగ్గరకు వెళ్ళలేకపోతే ప్రకృతిలోనికి వస్తూనే ఉంటాము, జనన మరణములనుండి విడుదల పొందలేము. అందువలన హృదయంలోఉన్న నిజందగ్గరకు మనలను తీసుకొనిపోవటానికి భగవాన్, ఆచార్యులవారు ప్రయత్నంచేసారు.

ఎవరైనా పొగిడితే మనకు సంతోషంవస్తుంది, ఎవరైనా విమర్శిస్తే మనకు దుఃఖం వస్తుంది. వీటినుండి బయటకు రావటానికి భగవాన్ ఒక చిట్కా చెప్పారు. నీకు ఎవరైనా అపకారంచేసినా ఉపకారంచేసినా, నిన్ను ఎవరైనా పొగిడినా విమర్శించినా ఇదిఅంతా God's doing అంటే దేవుని పని అనిఅనుకో. అక్కడకూడా దేవుడు ఉన్నాడుకదా ఆయనే ఇదిఅంతా చేయిస్తున్నాడు అని అనుకో అప్పడు నీమనస్సు చల్లబడుతుంది. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది. ఇది తెలుసుకొంటే ఈక్షణంలో నీదుఃఖం అణిగిపోతుంది. మనస్సు, మాట అణగాలి. మనస్సు అణిగినచోటనుండి జ్ఞానం ఉదయిస్తుంది. అక్కడనుండి నిజమైనమౌనం ప్రారంభమవుతుంది. ఆ మౌనంలోనుండి వచ్చినచూపే మనలను పవిత్రంచేస్తుంది. Human nature ఏవో తప్పలు చేస్తూఉంటుంది. Human nature ను Divine nature గా మార్చటానికి సాధన అవసరం. ఎవడికైతే Divine nature వచ్చిందో వాడికి లోపలఉన్న Divinity అందుతుంది. మనం ఆహారవిషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆహారంవిషయంలో జాగ్రత్తగాఉంటే ప్రాణశక్తి మన స్వాధీనంలోనికి వస్తుంది. గాలి మనకులోపలకువెళుతూఉంటుంది, బయటకు వస్తూఉంటుంది. ఈ ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ ఉండటంవలనకూడా నీ మనస్సు స్వాధీనంలోనికి వస్తుంది. మనం దేహానికి కంఫర్టు కోరుకొంటున్నాముగాని మనస్సుకు కంట్రోలు అవసరమని మనకు తెలియటంలేదు. మనోనిగ్రహంవలన మనకు శాంతి కలుగుతుంది. ఈ ప్రపంచంలోనుండి మనం Withdraw అవ్వవచ్చుగాని మనస్సులోనుండి Withdraw అవ్వటం అంత తేలికకాదు. మనస్సులోనుండి Withdraw అవ్వటానికే సాధన. నాలోఉన్న దోషాలను తొలగించి నన్ను సద్గుణాలతో, సహృదయంతో అలంకరించు అని అక్షరమణమాలలో భగవాన్ అన్నారు. అది గురువు చేసేపని. మనకు సహృదయంకలిగితే అదే మనలను హృదయంలోఉన్న పరమేశ్వరుడిదగ్గరకు తీసుకొనిపోతుంది. దేహమునేనుఅనే తలంపునుండి మనం విడుదలపొందాలి. అది పెరిగే వాతావరణం మనం కల్పించకూడదు. మనమాట, వేషధారణ చాలా సింపుల్‌గా ఉండాలి. మనలోపలఉన్నవస్తువు ఎంత సింపుల్‌గాఉందో, ఎంత సహజంగాఉందో మన దైనందినజీవితం అంతసింపుల్‌గాఉంటే, అంతసహజంగాఉంటే నదివెళ్ళి సముద్రంలో ఐక్యమయినట్లు నీవు హృదయంలోఉన్న





పరమేశ్వరుడిలో ఐక్యమవుతావు. మనకు ఉన్న అర్హతను భగవంతుడు చూస్తూఉంటాడు, మనం భగవంతుడిని మోసం చేయలేము.

గీతలో భగవంతుడు చెప్పినది నూటికి నూరుపాళ్ళు సత్యం. కాని అది మనకు అవగాహన కావటంలేదు. ఎందుచేతనంటే ఏ చైతన్యస్థాయిలోనుండి ఆమాటచెప్పాడో ఆ చైతన్యస్థాయి మనకు లేదుకాబట్టి మనం వింటున్నా, చదువుతున్నా అది మనకు అవగాహన కావటంలేదు. దానిని మనం జీర్ణించుకోలేకపోతున్నాము ఎందుచేతనంటే ఆ ఎత్తుకు మనం ఎదగలేదు. ఆ ఎత్తుకు ఎదగటానికే గురువు అనుగ్రహంకావాలి అని ఇంతకుముందు రామకృష్ణగారు చెప్పారు. దేహము నేనుఅనేది ఒకతలంపు. అది ప్రధమతలంపు. దానికి ఇతరతలంపులువస్తూఉంటాయి. దేహమునేనుఅనే తలంపును జపించటంకాదు. నీవుఎవరుఅని దానిని ప్రశ్నించు? దానిని విచారణచెయ్యి. ఆ మొదటితలంపే సైతాను. అదే పెద్దదోషి. ఆదోషి నెత్తిమీద దెబ్బలుకొడితే అది Withdraw అవుతూఉంటుంది. అందువలన దానిని జపించటంకాదు, దానిని ప్రశ్నిస్తూఉండు. ఆ మూలతలంపు మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. మూలతలంపును Withdraw చేసి దాని మూలంలోనికి పంపగలిగితే, అక్కడ ఉంచగలిగితే అది నశిస్తుంది. అది నశించినవెంటనే అక్కడఉన్న భగవంతుడు నీకు వ్యక్తమవుతాడు.

వేము అహంకారంకోసవే బ్రతుకుచున్నాము. దానిని తీసేయమని మీరుచెపుతున్నారు. దానిని తీసివేస్తే ఇంకబ్రతకటం ఎందుకు అంటున్నారు. వారు అలా ఎందుకు అంటున్నారుఅంటే అహంకారమేవారు అనుకొంటున్నారు. అహంకారంపోతే వారు పోతారు అనుకొంటున్నారు. అహంకారముపోతే వారుపోరు. వారు ఎవరిగా ఉన్నారో అది వారికి తెలియబడుతుంది. మనం సాధనచేస్తూ అహంకారమును అలంకరిస్తే అది ఎలాపోతుంది. ఏదో ఒకగంట సాధనచేసాముఅంటే మిగతా 23 గంటలు మాట ఏమిటి? మన దైనందినజీవితం ఎలా ఉండాలంటే మన మాటలోగాని, చేతలోగాని రూపబుద్ధి, నామబుద్ధి పెరగకూడదు. భగవంతునిరూపమును, నామమును స్మరించటంవలన మన నామరూపములనుండి విడుదల పొందుతాము. ఈ దేహంనాది, ఈపేరునాది అని అనుకొన్నంతకాలం నీవు అజ్ఞానంనుండి విడుదలపొందలేవు. రూపబుద్ధినుండి, నామబుద్ధినుండి విడుదల పొందినప్పడే నామరూపములులేని సద్వస్తువు నీకు వ్యక్తమవుతుంది. రాగద్వేషములు అనే బురదలో నీ మనస్సుఉంది. మనస్సు నశిస్తేగాని నీకు మోక్షంరాదు. ఆ బురదలోనుండి నీమనస్సును బయటకులాగు. ఆ బురదలోనుండి

బయటకు రావటానికి వివేకవంతులతోటి, బుద్ధిమంతులతోటి, శాంతచిత్తముకలవారితోటి, నీకంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారితోటి సహవాసం చెయ్యి.

నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా నీలోపలఉన్న సద్వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఇప్పడు దేహమునేనుఅనేతలంపు నీకు ఎంత సహజంగాఉందో అలా నీలోపల ఉన్న సద్వస్తువు అంత సహజంగా నీకు వ్యక్తమవ్వాలి అప్పడుగాని నీవు జననమరణ ప్రవాహంనుండి విడుదలపొందలేవు మనకు ఏది మంచిదో మనకంటే ఎక్కుగా భగవంతుడికి తెలుసు. కాని అది మనం గుర్తించలేకపోతున్నాము. అందువలననే మనకు శరణాగతి కుదరటంలేదు. శరణాగతివలనకూడా మూలతలంపు నశిస్తుంది, విచారణవలనకూడా మూలతలంపు నశిస్తుంది. మీరు ఏమార్గంలో ప్రయాణంచేసినా మిధ్యానేనునుండి విడుదలపొందాలి. కాని సాధనపేరుమీద దానిని అలంకరిస్తున్నాము ఇంక అందులోనుండి ఎలా బయటకు వస్తాము. నీవు ఒక దేహంతోటి, ఒక నామంతోటి తాదాప్యం పొందుతున్నావు. అది ఒకవేషం. ఆ వేషంనుండి బయటకురా అప్పడు ఉన్నవస్తువు నీకు ప్రత్యక్షముగా అనుభవంలోనికి వస్తుంది. ఈరోజు రామకృష్ణగారు మనకు చెప్పిన సందేశం ఏమిటి అంటే మనం ఏదైతే పొందాలి అనుకొంటున్నామో, ఏభగవంతుడిని అయితే పొందాలి అనుకొంటున్నామో ఆయన అనుగ్రహం లేకుండా, ఆయన దయలేకుండా ఆయనను పొందలేము.

రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, పాలకొల్లు ది. 09-12-2001)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మాకు ఆత్మజ్ఞానం కలుగుతుందా, ఆత్మసుఖం అందుతుందాఅని అందరికి అనుమానం వస్తోంది అందరికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఇందులో తొందరపడవలసిన పనిలేదు. శరీరానికి రోగంవస్తే నూటికి 90 వంతులు తగ్గింది అనుకోండి, ఇంకా 10 వంతులు ఉంది అనుకోండి. దానిని అశ్రద్ధచేస్తే అది పెరిగిపోతుంది. అలాగే 100 రూపాయలు అప్పఉంటే 90 రూపాయలు తీర్చివేసి ఇంకా 10 రూపాయలేకదా అని అలక్ష్యం చేస్తే అది పెరిగిపోతుంది. నిప్పరవ్వ చిన్నదికదా అని వదిలేస్తే అది గడ్డిమేటులను, ఇళ్లను అంటించివేస్తుంది. అలాగే మనలోఉన్న అజ్ఞానాన్ని 90 వంతులు పోగొట్టుకొని 10 వంతులు వదిలేస్తే అది పెరిగిపోతుంది. మీలోఉన్న అజ్ఞానాన్ని, దేహబుద్ధిని నూటికి నూరుపాళ్లు తగ్గించుకోవాలిఅంటే నిశ్శేషంగా నశించాలి. 1% మిగిలినా అది పునర్జన్మను తీసుకొనివస్తుంది. మీరుఒడ్డుకు వచ్చిన తరువాత వచ్చాము అనుకోవాలిగాని ఎట్టిపరిస్థితులలోను దానిని నమ్మటానికి వీలులేదు. ఎప్పడు

20-12-2001

3A

మాయ మనలను కమ్ముతుందో చెప్పలేము. చివరిశ్వాసవరకు సాధనలో బహుజాగ్రత్తగా ఉండాలి. సత్పురుషులతో సహవాసం ముఖ్యం. మనకు సబ్జక్టు అర్థమవుతూఉంటే సాధన పేరుమీద ఎక్కువ శ్రమపడవలసిన పనిలేదు. సబ్జక్టు అర్థంచేసుకోవటానికి కొంచెం సహనం, ఓర్పు అవసరం. మన బ్రెయిన్‌కు పనిచెప్పాలి. సహనం పెరిగేకొలది ఆలోచనయొక్క లోతులు పెరుగుతాయి. లోతు ఆలోచనలోనుండే మంచిభావాలు వస్తాయి. ఆలోచనయొక్క లోతులు పెరుగుతూఉంటే చాలా వికారములనుండి బయటకు రావచ్చును.

ఆత్మజ్ఞానం అనేది బాహ్య ప్రక్రియలవలన వచ్చేదికాదు. మనస్సు అణగాలి. సాత్వికబుద్ధిని సంపాదించుకోవాలి. అణిగినమనస్సు ఆత్మవైపుకు జరుగుతూ ఉంటుంది. రజోగుణం, తమోగుణం తగ్గించుకొంటూ సత్వగుణాన్ని పెంచుకొంటూరావాలి. మనం ప్రపంచాన్ని చూస్తున్నాము. ఈ ప్రపంచం ఎంతవరకు నిజంఅంటే ఈ దేహము నేనుఅని ఏ బుద్ధిఅయితే చెపుతోందో ఆబుద్ధి ఎంత నిజమో ఈ ప్రపంచంకూడా అంతేనిజం, మన ఇష్టాలు, అయిష్టాలు, విరోధాలు, బాధలు అన్నీకూడా అంతే నిజం. మనలోపల ఉన్న బ్రహ్మం, శాంతి, కాంతి ఏదేహంద్వారా ఎక్కువగా వ్యక్తమవుతోందో వారిని గురువులుఅని, అవతారపురుషులుఅని పిలుస్తారు. భగవంతుడు ఆయన ప్రతినిధులను ఈ లోకంలోనికి పంపిస్తాడు. వారు మటుకే ఆయన పనిచేస్తూ ఉంటారు. మనలోపల ఒక సద్వస్తువుఉంది, బ్రహ్మంఉంది. దానిని తెలుసుకోవాలనే కాంక్ష మనకురాలేదు. మహాత్ములతో, సత్పురుషులతో సహవాసంవలన ఆ తెలుసుకోవాలనే కాంక్ష కలుగుతుంది. ఈ దేహమునాదిఅని దేహం చెప్పటంలేదు, లోపల ఉన్న చైతన్యం చెప్పటంలేదు. ఈ దేహమునాదిఅని నేనుచెపుతున్నాను. దేహమునాదిఅని ఏ నేనుఅయితే చెపుతోందో దానికి వచ్చే వికారములుఅన్నీ దేహముమీద పడుతూఉంటాయి. అహంకారము ఉన్నంతసేపు నీకు వికారాలు వస్తూఉంటాయి. నీకు సంతోషం వచ్చినప్పడు

**జగత్తుతో సంబంధాన్ని పురస్కరించుకొని బ్రహ్మమును ఈశ్వరుడని పేర్కొన్నారు. మనం ఒండొరులతో మాట్లాడుకున్నట్లే, ఈశ్వరునితో కూడా మాట్లాడవచ్చు. అయితే, అందుకు మనశ్శుద్ధి, మనోబలం, ధ్యాననిష్ఠ అవసరం.**

\- భగవాన్ శ్రీ రమణ మహర్షి